సాక్షి నిజామాబాద్

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



మండల కమిటీలు లేకుండా..

జిల్లా కబడ్డీ అసోసియేషన్‌లో మండల కమిటీలను ఎన్నుకోకుండానే జిల్లా కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు.

- 8లో ▸



జక్రాన్‌పల్లిలో పసుపుబోర్డు..

పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పసుపుబోర్డు జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేయిస్తానని టి.జీవన్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /23.2

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృత మవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్
- దుబాయ్‌లోని ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశం

ఖలీల్‌వాడి: గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబాయ్‌లో ఓ హోటల్‌లో జరిగిన తెలంగాణ ప్రవాసుల ఆత్మీయ సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే జీవన్‌రెడ్డి జూమ్ ద్వారా ఆన్‌లైన్‌లో కార్మికులతో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల కష్టాలను కాంగ్రెస్ పార్టీ అధ్యయనం చేసిందన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక కట్టుకున్న భార్య, కన్న పిల్లలను, సొంత ఊరిని వదిలి బతుకుదెరువు కోసం మనవారు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారన్నారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలల్లో కొన్ని సీట్లు కేటాయించడం, ఆరోగ్యశ్రీ వర్తింపజేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కొంతమేర ప్రాధాన్యత ఇవ్వడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్, జీడబ్ల్యూఏసీ నాయకుడు కట్కం రవి, కోరేపు మల్లేశ్, తోట రాంకుమార్, దేవేందర్ రెడ్డి, కలిగోట్ సత్యం గౌడ్, మనోజ్, బండలింగాపూర్ సత్యం, తిరుపతి, రమేశ్, వెంకటేశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.


రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభ్యున్నతికి పాటుపడాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్: అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభ్యున్నతికి పాటుపడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. అన్ని వర్గాల వారికి రాజ్యాంగబద్ధంగా హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పులాంగ్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ట్రెయినీ ఐఏఎస్ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శశికళ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం



బాల్కొండ: యాసంగీ సీజన్‌లో ఆయకట్టుకు చివరి తడిగా కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. మూడు రోజులుగా కాలువల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. రోజుకు 0.4 టీఎంసీల చొప్పున ఇది వరకే 1.2 టీఎంసీల నీరు ఖాళీ అయింది. కాకతీయ కాలువ ద్వారా ఐదు వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 271 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1058.30(11.4 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తా'

కామారెడ్డి టౌన్: రాజకీయాల్లో మార్పు కోసం జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు గుడిమెట్ మహాదేవ ఆలయ పీఠాధిపతి మహాదేవ్ స్వామీజీ తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

సోషల్ ఇంజినీరింగ్!

- నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కసరత్తు
- కులాలు, వర్గాల వారీగా లెక్కలు వేసుకుని విడతలవారీగా సమ్మేళనాలు
- గంపగుత్తగా ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు
- సెగ్మెంట్లవారీగా ఆయా బూత్‌ల్లో కులసంఘాలతో టచ్‌లోకి..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఒకవైపు మరాఠ్వాడా, మరోవైపు కన్నడ సీమతో సరిహద్దులు కలిగి ఉన్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జహీరాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాలు విస్తరించి ఉన్నాయి. ఈ రెండు చోట్ల ఎంపీలుగా బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇక్కడి పరిస్థితులకు తగినట్లుగా ప్రచారపర్వంలో సోషల్ ఇంజినీరింగ్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. కులాలు, వర్గాల వారీగా లెక్కలు వేసుకుని ఆయా శాసనసభ సెగ్మెంట్లలో బూత్‌ల వారీగా ఉన్న ఓట్ల లెక్కల ఆధారంగా గంపగుత్తగా ఓట్లు వేయించుకునేందుకు అనేక రకాల పాట్లు పడుతున్నారు. అభ్యర్థులు ప్రచారపర్వంలో కులసంఘాల ద్వారా ఆయా వర్గాల ఓట్లకు గాలం వేసే కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం.

■ కర్ణాటక రాష్ట్రానికి ఆనుకుని ఉన్న జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, ఆందోల్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న సురేష్ షెట్కార్, బీజేపీ నుంచి బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌లు ఇద్దరు లింగాయత్ సామాజిక వర్గం వారు కాగా, బీఆర్‌ఎస్ తరఫున బరిలో నిలిచిన గాలి అనిల్‌కుమార్ మున్నూరుకాపు కులానికి చెందినవారు. అయితే ఈ స్థానంలో లింగాయత్, మున్నూరుకాపు, ముదిరాజ్ కులాల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. తర్వాత ఎస్సీ, పద్మశాలి, ముస్లిం, యాదవ, గౌడ్, రెడ్డి, వైశ్య కులాల ఓట్లు ఉన్నాయి. కాగా నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో లింగాయత్ ఓట్లు భారీగా ఉన్నాయి. తర్వాత మున్నూరుకాపు ఓటర్ల విషయానికి వస్తే ఏడు సెగ్మెంట్లలో గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ముదిరాజ్, ముస్లిం ఓట్లు సైతం అన్ని సెగ్మెంట్లలో ఎక్కువగానే ఉన్నాయి. ప్రతి సెగ్మెంట్‌లో చెప్పుకోదగిన స్థాయిలో పద్మశాలి, ఎస్సీ, యాదవ, గౌడ్ కులాల ఓట్లు ఉన్నాయి. ఇక కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల వైశ్య సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ కులాల ఓట్ల లెక్కలను దగ్గర పెట్టుకుని బూత్‌ల వారీగా వివరాలు సేకరించుకుని ఆయా కులసంఘాలతో సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలను అభ్యర్థులు నిర్వహిస్తున్నారు. అయితే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సురేష్ షెట్కార్, బీబీ పాటిల్ ఒకే సామాజిక వర్గం వారు కావడంతో లింగాయత్ ఓట్లు ఎవరివైపు ఎక్కువగా వెళ్తాయనే ఉత్కంఠ నెలకొంది.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాల ఓట్లు సైతం గణనీయంగా గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నాయి. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోనూ కొంతమేరకు గల్ఫ్ కార్మిక కుటుంబాల ఓట్లు ఉన్నాయి. దీంతో గల్ఫ్ కుటుంబాల ఓట్ల కోసం ప్రధాన పార్టీలు గాలం వేసే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగా ఆదివారం దుబాయ్‌లో గల్ఫ్ కార్మికులతో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఇంటరాక్ట్ అయ్యారు. అలాగే నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి జూమ్ మీటింగ్‌లో గల్ఫ్ కార్మికులతో మాట్లాడారు. మరోవైపు ఈ నెల 21వ తేదీన బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు రాణిరుద్రమ దుబాయ్‌లో గల్ఫ్ కార్మికులతో సమావేశం నిర్వహించనున్నారు.

■ మహారాష్ట్రను ఆనుకుని ఉన్న నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధి జగిత్యాల వరకు ఉంది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల శాసనసభ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ స్థానంలో బరిలో ఉన్న బీజేపీ సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌లు మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి రెడ్డి కులానికి చెందినవారు. ఈ పార్లమెంట్ పరిధిలోని అన్ని శాసనసభ సెగ్మెంట్లలో మున్నూరుకాపు, ముస్లిం, పద్మశాలి ఓట్లు గణనీయంగా ఉన్నాయి. తర్వాత ముదిరాజ్, రెడ్డి, యాదవ్, గౌడ్‌ల ఓట్లు చెప్పుకోదగిన స్థాయిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు అర్వింద్, బాజిరెడ్డి గోవర్ధన్‌లు ఇద్దరూ మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు కావడంతో సదరు కులం ఓటర్లలో చీలిక ఏ మేరకు ఉంటుందనే విషయమై కచ్చితమైన అంచనాలు రావడం లేదు.

జీపీ కార్మికులకు ప్రత్యేక కష్టాలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- మోపాల్ మండలం మంచిప్పలో గైర్హాజరైన కార్మికులకు నోటీసులు
- నాలుగు నెలలుగా జీపీల్లో నిండుకున్న నిధులు
- జనరల్ ఫండ్ నుంచే అరకొరగా అడ్వాన్సుల చెల్లింపు



మంచిప్ప జీపీ వద్ద కార్మికుల ఆందోళన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ మండలం మంచిప్పలో 10 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. వారికి మూడు, నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో ఈనెల 8వ తేదీ నుంచి విధులు రావడంలేదు. తద్వారా గ్రామమంతా చెత్తాచెదారం, పారిశుధ్యంతో అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధాన రోడ్డుపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. చివరకు పంచాయతీ కార్యాలయంలో కూడా చెత్త తొలగించే వారు లేరు. ఐదు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో 10 మంది కార్మికులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులిచ్చారు. విధులకు ఎందుకు హాజరు కావడం లేదో రెండు రోజుల్లో చెప్పాలని నోటీసు సారాంశం. నోటీసులను అందుకున్న కార్మికులు జీపీ వద్ద ఆదివారం ఆందోళన చేశారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ప్రత్యేక పాలన కష్టాలు ఎదురవుతున్నాయి. కారోబార్లు మొదలుకుని వాటర్‌మెన్లు, పారిశుధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లకు చాలా గ్రామాల్లో మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 530 పంచాయతీలున్నాయి. అందులో 2,440 మంది వరకు మల్టీపర్పస్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇంకో 600 మంది వరకు కార్మికుల కొరత ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు నెలకు రూ. 9,500 చెల్లిస్తున్నారు.

పంచాయతీ ఖాతాలు ఖాళీ

గ్రామ పంచాయతీలకు నాలుగు నెలలుగా 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు రావడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా చేతులెత్తేయడంతోనే పంచాయతీ కార్మికులకు వేతనాలు అందడంలేదు. గత ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. మరుసటి రోజు నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అంతకుముందు నుంచే పంచాయతీలకు ఎలాంటి గ్రాంట్లు రావడంలేదు. పన్నుల రూపంలో వచ్చిన నగదును పండుగల వేళ అరకొరగా అడ్వాన్సులు ఇస్తున్నారు. గ్రాంట్లు లేక చెక్కులు కూడా క్లియర్ కావడం లేదు. చాలాగ్రామాల్లో జనరల్ ఫండ్ లేక.. స్టేట్ ఫండ్, ఆర్థిక సంఘం నిధులు రాక మూడు నెలలుగా జీతాలు చెల్లించడంలేదు.

పైసల్లేక అవస్థలు పడుతున్నాం



మంచిప్ప జీపీ కార్మికులుగా నా భర్త నేను పదేళ్లుగా పని చేస్తున్నాం. నాలుగు నెలలుగా జీతాలు రావడంలేదు. అధికారులు, సెక్రెటరీకి చెబితే చెల్లిస్తామని చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదు. ఇంట్లో సరుకులు లేక అప్పులు తెచ్చుకున్నాం. మందు లకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. వేతనాలు రాకపోవడంతోనే పనికి రావడం లేదని చెప్పినా నోటీసులు ఇచ్చారు. త్వరగా వేతనాలు చెల్లించి ఆదుకోవాలి.

–చింతకుంట లక్ష్మి, మల్టీపర్పస్ వర్కర్, మంచిప్ప

మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలిస్తున్నాం



జిల్లాలోని అనేక గ్రామాల్లో మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నాం. 530 జీపీల్లో 521 పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు డిజిటల్ కీ ఇచ్చాం. 18 జీపీల్లో సాంకేతిక సమస్యలు ఉన్నాయి. చెక్కులు కూడా క్లియర్ చేస్తున్నాం. జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లిస్తున్నాం. వేతనాలు రాని కార్మికులకు త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. – చక్రవర్తుల తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

ఇజ్రాయెల్‌లో మనోళ్లు సేఫ్

- తాము క్షేమమేనంటూ ఇంటికి సమాచారమిస్తున్న తెలంగాణ వాళ్లు
- ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం ఆగినట్లు వార్తలు
- అయినప్పటికీ ఇక్కడున్న కుటుంబ సభ్యుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్–ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లిన తెలంగాణవాసులు క్షేమంగా ఉన్నట్లు సమాచారం. కానీ ఇక్కడ ఉన్న వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఇజ్రాయెల్‌లో పనిచేస్తున్న నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు తమ కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్లు చేసి తమ క్షేమసమాచారాన్ని అందించారు. అయినప్పటికీ వరుసగా చోటుచేసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడున్న వారిలో ఆందోళన నెలకొంది. ఇజ్రాయెల్‌పై ఆదివారం ఇరాన్ 185 డ్రోన్లు, 110 బాలిస్టిక్ మిస్సైల్స్, 36 క్రూయిజ్ మిస్సైల్స్‌ను ప్రయోగించింది. మధ్యధరా సముద్రంలోని యూఎస్, యూకే, ఫ్రాన్స్, జోర్డాన్ దళాలు అడ్డుకుంటున్నాయి. అదేవిధంగా ఐరన్ డోమ్, ఐరన్ బీమ్(లేజర్ టెక్నాలజీ)లతో ఆయా మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ తమ భూ భాగంలో పడకుండా అడ్డుకుంటోంది. దాదాపు 95 శాతం మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ నిర్వీర్యం చేసింది. అయితే శనివారం 17 మంది భారతీయులు ఉన్న నౌకను ఇరాన్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

దీంతో అలజడి నెలకొంది. ఇజ్రాయెల్‌లో సుమారు 25వేల మంది భారతీయులు ఉండగా, వెయ్యి మంది వరకు తెలంగాణ వారున్నారు. వీరిలో ఎక్కువగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలవారున్నారు. టెల్‌అవీవ్ నగరంలో మనవాళ్లు ఎక్కువగా ఉంటున్నారు. ఇప్పటికే అక్కడి పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. ఇక భారత ప్రభుత్వం సైతం ఇజ్రాయెల్, ఇరాన్‌లకు వెళ్లొద్దని నోటిఫికేషన్ ఇచ్చింది. ఇదిలా ఉండగా ప్రస్తుతానికి యుద్ధం ఆగినట్లు, యుద్ధ వాతావరణం సమసిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటివరకు మనవాళ్లు సేఫ్‌గా ఉన్నారు. దీంతో ఇక్కడున్న వారి కుటుంబ సభ్యుల్లో ఉత్కంఠ కొంతమేర తగ్గింది.

ఆస్పత్రుల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

- నిబంధనలు పాటించకుండా సానిటేషన్, పేషెంట్ కేర్‌టేకర్, సెక్యూరిటీ సిబ్బంది నియామకం
- తక్కువ మంది సిబ్బందితోనే సేవల కొనసాగింపు
- అధికారుల మాటలను ఖాతరు చేయని వైనం



మోర్తాడ్: వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో సానిటేషన్, పేషెంట్ కేర్‌టేకర్, సెక్యూరిటీల కోసం సిబ్బందిని నియమించడంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, నవీపేట్, వర్నిలలో 30 పడకల ఆస్పత్రులు ఉన్నాయి. బోధన్, ఆర్మూర్‌లో వంద పడకలు, జిల్లా కేంద్రంలో జనరల్ ఆస్పత్రి ఉన్నాయి. వీటిలో మూడు రకాల సేవల కోసం సిబ్బందిని వైద్య విధాన పరిషత్ నేరుగా నియామకాలు చేపట్టకుండా ప్రైవేటు ఏజెన్సీలకు కాంట్రాక్టు ఇచ్చింది. 30 పడకల ఆస్పత్రుల్లో 13 మంది చొప్పున, నిజామాబాద్ జనరల్ ఆస్పత్రిలో 200 మంది, వంద పడకల ఆస్పత్రుల్లో 41 మంది చొప్పున సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించాల్సి ఉంది. జనరల్ ఆస్పత్రిని మినహాయిస్తే మిగిలిన ఆస్పత్రుల్లో మాత్రం సరిపడేంత ఉద్యోగులను ఏజెన్సీలు నియమించలేవు. 30 పడకల ఆస్పత్రిలో 13 మందికి 8 మందిని, వంద పడకల దవాఖానాలో 41 మందికి 20 మందితోనే మూడు విభాగాల సేవలను నెట్టుకొస్తున్నారు.

అధికార పార్టీ అండతో..

కాంట్రాక్టు పొందిన ఏజెన్సీల యజమానులకు గతంలో బీఆర్‌ఎస్ నేతల అండదండలు ఉండగా ప్రస్తుతం వారు పార్టీ మారి కాంగ్రెస్ చెంతన చేరినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రధాన నాయకుల ఆశీస్సులను పొందడంతో తమ ఏజెన్సీలకు కాంట్రాక్టును కొనసాగించుకోవచ్చు అని కాంట్రాక్టర్లు భావిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల మద్దతు ఉండటంతో ఆస్పత్రుల నిర్వహణకు పూర్తి స్థాయి సిబ్బందికి బదులు నామమాత్రంగా నియామకాలు చేపట్టి బిల్లులను మాత్రం పూర్తిగా దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బందికి పని భారం కావడంతో ఆస్పత్రుల నిర్వహణ అస్తవ్యస్తంగా వదలివేసినట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రుల నిర్వహణ కోసం నిర్దేశించిన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించేలా ఏజెన్సీలపై ఒత్తిడి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

విచారణ జరిపించాలి

ఆస్పత్రుల్లో కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరుపై విచారణ జరిపించాలి. అప్పట్లో బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ నేతల అండదండలు ఉన్నాయనే ధీమాతో సిబ్బందిని తక్కువగా నియమించి సేవలు అందకుండా చేయడం సరికాదు. అధికారులు నిబంధనలను పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. – పుప్పాల నరేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు, మోర్తాడ్

మామిడి రైతుకు దిగుబడి దెబ్బ

- ప్రతికూల వాతావరణంతో సరిగ్గా కాత రాని వైనం
- పెరిగిన సాగు ఖర్చులు.. తగ్గిన ఆదాయంతో రైతుల ఆవేదన
- జిల్లాలో నాలుగు వేల ఎకరాల్లో మామిడి తోటలు



సాలూర మండలం మందర్న గ్రామానికి చెందిన రైతు హనుమంత్ తనకున్న ఎకరం 5 గుంటల భూమిలో దశాబ్ద కాలం నుంచి మామిడి పంటను సాగు చేస్తున్నాడు. ప్రతి ఏడాది వ్యాపారులు రూ.లక్షకు పైగా చెల్లించి తోటలోని మామిడి పండ్లను తీసుకెళ్లేవారు. ఈ ఏడాది దిగుబడి సరిగ్గా లేక రూ.50 వేలు కూడా చెల్లించేందుకు ముందుకు రావడం లేదని రైతు ఆందోళన చెందుతున్నాడు.



మందర్నలో కాత కాయని మామిడి చెట్లు



రాలిన మామిడి కాయలు

బోధన్‌రూరల్(బోధన్): ఈసారి సీజన్‌లో మామిడి చెట్లకు విరగబూసిన పూత రాలిపోయింది. ప్రతికూల వాతావరణం (అధిక చలి) ప్రభావంతో పూత రాలిపోవడమే కాకుండా కాస్త కాసిన మామిడి కాయలు ఎదగక పోవడం, చెట్లపైనే కుళ్లిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో మామిడి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. నిజామాబాద్ జిల్లా తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు మంజీర తీరంలో గల సాలూర మండలంలోని మందర్న, హున్స గ్రామాలు మామిడి తోటల సాగులో ప్రత్యేక గుర్తింపు పొందాయి. దశాబ్దాల కాలం నుంచి ఈ రెండు గ్రామాల్లో సుమారు 80 నుంచి 100 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల్లో సుమారు 3,500 నుంచి 4,000 ఎకరాల వరకు రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు చెపుతున్నారు. ఇసుక, చౌక నేలలు ఉన్న ప్రాంతాల్లో రైతులు రెండు, మూడు దశాబ్దాల నుంచి మామిడి పంటను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, పెద్ద రసం, చిన్న రసం, దసేరి, రత్న వంటి రకాల మామిడిని రైతులు సాగు చేస్తున్నారు.

కాయ సైజు పెరగలేదు..

మామిడి చెట్లకు ప్రతి సీజన్ డిసెంబర్, జనవరి నెలల్లో పూత వస్తుంది. ఈసారి పూత సరిగ్గా రాకపోవడంతో మందులను వాడాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. మందుల వాడకంతో చెట్లకు పూత వచ్చినా.. అధిక చలితో మొత్తం రాలిపోయిందని దిగుబడి పడిపోయిందన్నారు. కొన్ని చెట్లకు కాయలు కాసినా సైజు పెరగలేదని, మరి కొన్ని చెట్లకు కాయలు కుళ్లిపోయినట్లు వివరించారు. యేటా ఎకరం మామిడి పంటకు రూ.లక్ష కు పైగా తమకు ఆదాయం వచ్చేదని, ఈ సారి రూ. 50 వేలు కూడ వచ్చే పరిస్థితి లేదంటున్నారు. మరోవైపు ఉద్యానవన శాఖ నుంచి సరైన సహకారం లభించడం లేదని, అధికారులు తమ తోటలవైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోయారు. మామిడి తోటల సాగులో మెలకువలు, దిగుబడి పెంచుకునే సూచనలు, సలహాలు అందక నష్టపోతున్నామన్నారు.కాగా జిల్లా ఉద్యానవన శాఖలో అధికారుల కొరత ఉంది. అనేక చోట్ల 8, 9 మండలాలకు ఒక్క అధికారే ఇన్‌చార్జిగా ఉండటంతో ఉద్యానవన పంటలపై పర్యవేక్షణ లోపం తలెత్తుతోంది. మార్కెటింగ్ సౌకర్యం లేకపోగా, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో మామిడి పంటను అమ్ముకునేందుకు రైతులు స్థానిక వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు చెప్పిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది.

ప్రతికూల వాతావరణంతో..



నేను ఎకరంలో 20 ఏళ్లకు పైగా బంగినపల్లి రకం మామిడి సాగు చేస్తున్నాను. మూడేళ్ల నుంచి లాభాలు రావడం లేదు. అధిక చలితో పూత రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. కొన్ని చెట్లకు కాయలు వచ్చినా అవి పెద్దగా అవ్వకముందే చెట్టు నుంచి రాలిపోయాయి. దీంతో ఏటా రూ.లక్షకు పైగా వచ్చే ఆదాయం ఈ సారి రూ.50 వేలు వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం దృష్టి సారించి మామిడి రైతులను ఆదుకోవాలి.

– నిబ్బూరి సుధాకర్, మామిడి రైతు, మందర్న గ్రామం, సాలూర మండలం

క్లుప్తంగా

అగ్నిమాపక వారోత్సవాలు



ఖలీల్‌వాడి: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా అగ్నిమాపక అధికారి మురళీమనోహర్ రెడ్డి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. అంతకు ముందు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి భానుప్రతాప్, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జి నియామకం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జిగా రాజానరేందర్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా ఓబీసీ సెల్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ దక్కేలా పని చేస్తానని అన్నారు.

ఫరీదుపేట వాసికి జాతీయ ఉగాది పురస్కారం



కళా ప్రదర్శన ఇస్తున్న దేవాగౌడ్

మాచారెడ్డి : పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన జానపద కళాకారుడు కర్రోల్ల దేవాగౌడ్‌కు మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ ఆధ్వర్యంలో ఉగాది జాతీయ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం ఆన్ లైన్ ద్వారా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు దేవాగౌడ్ సాక్షికి తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించిన ఆ సంస్థ వారు దేవాగౌడ్ ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

చౌకి రాజేంద్రకు ఉగాది సత్కారం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి గంజ్ ఉన్నత పాఠశాల భాషోపాధ్యాయుడు చౌకి రాజేంద్రకు ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో పద్య సారస్వత పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం–శ్రీరామాయణభానువు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో రాజేంద్రకు జ్ఞాపిక, శాలువతో సత్కారం, శ్రీరామయణ పుస్తకంతో పాటు ఉగాది సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి, పద్య సారస్వత పీఠం అధ్యక్షుడు దత్తన్న, సీనియర్ ప్రాతికేయులు రావికంటి శ్రీనివాస్, ఆకెళ్ల రాఘవేంద్ర, రావుల గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులకు బంగారు పతకాలు



నిజామాబాద్‌నాగారం: తమిళనాడులో ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి ఇంటర్ జోన్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. మహిళా విభాగంలో గూగులోత్ మమత (సాంఘిక సంక్షేమ ఆర్మీ డిగ్రీ కళాశాల, భువనగిరి), లకావత్ రాణి (సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, సుద్దపల్లి) ఉన్నారు. పురుషుల విభాగంలో గుండా వినయ్ (సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, బోధన్) బంగారు పతకాలు అందుకున్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ క్రీడాకారులను అభినందించారు.

మండల కమిటీలు లేకుండానే ఎన్నికలు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్‌లో గందరగోళం
- ఎలక్షన్ నోటిఫికేషన్‌పై పెదవి విరుస్తున్న సీనియర్ క్రీడాకారులు

కబడ్డీ అసోసియేషన్ మండల కమిటీలు లేకుండానే జిల్లా కమిటీకి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడం సర్వత్రాచర్చనీయాంశమైంది. జిల్లా కమిటీ ఎన్నికల్లో మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. మండల కమిటీలు వేయకుండా జిల్లా కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ ఎలా విడుదల చేశారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్‌నాగారం: క్రమశిక్షణకు మారుపేరైన క్రీడారంగం ఏకఛత్రాధిపత్యానికి, నిర్లక్ష్యానికి మారుపేరుగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్లుగా క్రీడా సంఘాల ఎన్నికలను తూతూమంత్రంగా నిర్వహిస్తూ పాతవారినే అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగిస్తున్నారని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా ఏళ్ల తరబడిగా ఆధిపత్యం కొనసాగించడం మామూలు విషయంగా మారింది. తమకు అవకాశం దక్కడం లేదని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక నోటిఫికేషన్‌ను ఈనెల 12వ తేదీన విడుదల చేశారు. మే 5న జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని కార్యదర్శి లింగన్న జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించాలంటే మండల కమిటీలు వేయాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా



జిల్లాలో ఎక్కడా మండల కమిటీలు వేసిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాలకు చెందిన సీనియర్ క్రీడాకారులు, క్లబ్‌లతో మండల కమిటీ వేయాల్సి ఉండగా ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు.

ఓటరు జాబితా ఎలా రూపొందిస్తారు?

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటరు జాబితాను ఎలా రూపొందిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారిని సైతం నియమించారు. జిల్లా కమిటీని ఎన్నుకునేందుకు మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకవేళ మండల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అందుబాటులో లేకుంటే వారి అనుమతి మేరకు కార్యవర్గంలో ఎవరైనా ఓటు వేసే అవకాశం ఉంటుంది. అయితే, మండల కమిటీలు లేకుండా ఓటరు జాబితా ఎలా రూపొందిస్తారు? జిల్లా కమిటీని ఎలా ఎన్నుకుంటారని క్రీడాకారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఏం చేస్తారో?

కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి పరిశీలకులుగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నుంచి ఒకరు వస్తారు. అలాగే జిల్లా ఒలింపిక్ సంఘం, స్పోర్ట్స్ అథారిటీ అధికారి సైతం ఎన్నిక ప్రక్రియను పరిశీలిస్తారు. సదరు అధికారులు ఓటరు జాబితాను పరిశీలించాల్సి ఉంటుంది. మండల కమిటీలు లేకుండా రూపొందించే జాబితాను ఆమోదిస్తారా? లేక అభ్యంతరం తెలుపుతారా? అనేది చర్చనీయాంశమైంది.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపుతా



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

- ఎంపీగా అర్వింద్, ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదు
- కార్యకర్తల సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి: తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీగా అర్వింద్, ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి జిల్లా ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానన్న అర్వింద్.. బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో ప్రజలకు చూపాలన్నారు. తనకు ఎంపీగా అవకాశం కల్పిస్తే పార్లమెంటులో కొట్లాడి పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల్లో కనీసం నాలుగు గ్యారంటీలు కూడా అమలు కావడం లేదని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని అన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో యాభై శాతం మంది రైతులు తక్కువ ధరకు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాన్ని అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పదేళ్లలో తాము ఎంతో అభివృద్ధి చేశా మన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జెడ్పీటీసీ తనుజా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ విమలరాజు, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, నాయకులు జక్కం బాల్‌కిషన్, చింత మహేశ్, పుప్పాల శ్రీనివాస్, అక్బర్‌ఖాన్, శేఖర్ పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న వినయ్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

- ముగ్గురు యువకులకు అంతిమవీడ్కోలు
- ఒడ్యాట్‌పల్లిలో అలుముకున్న విషాదఛాయలు

మాక్లూర్: చెరువులో మునిగి మృతి చెందిన ముగ్గురు యువకులకు మండలంలోని ఒడ్యాట్‌పల్లిలో అశ్రునయనాల మధ్య అంతిమవీడ్కోలు పలికారు. తిరుపతి, నరేశ్, మహేశ్ అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కాంగ్రెస్‌పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ గోవూరి ఒడ్డెన్న తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ముగ్గురి మృతదేహాలను వరుసగా తీసుకెళ్తున్న దృశ్యాన్ని చూస్తూ గ్రామస్తులు కంటతడి పెట్టారు.

అధికారులే కారణం..

ఒడ్యాట్‌పల్లి చెరువులో మొరం త్వడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, ముగ్గురు యువకుల మృతికి అధికారులే కారణమని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ ఆరోపించారు. ఆదివారం ఆయన ఒడ్యాట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముగ్గురి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఒక్కో బాధిత కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

జక్రాన్‌పల్లిలో పసుపుబోర్డు ఏర్పాటు చేయిస్తా

- ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయం
- కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



అర్గుల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

జక్రాన్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, ఎంపీగా తనను గెలిపిస్తే జక్రాన్‌పల్లి మండలంలోనే పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్గుల్‌లో ఉన్న గురడిరెడ్డి కమ్యూనిటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లు ఎంపీగా పనిచేసిన అర్వింద్ ఈ ప్రాంత ప్రజలకు చేసింది శూన్యమన్నారు. జిల్లాలో పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, బడా వ్యాపారులకు లాభం చేకూర్చేలా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. గుజరాత్ బడా వ్యాపారులకు రూ.14 లక్షల కోట్లను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం.. రైతు రుణాలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దివంగత వైఎస్సార్ హయాంలో రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, రైతులకు రూ.2లక్షల రుణా మాఫీ చేస్తామన్నారు. రూ.70కే పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తామన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, 21 ప్యాకేజీ ద్వారా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సాగు నీరందిస్తామని తెలిపారు. అదేవిధంగా గుత్ప ఎత్తిపోతల విస్తరణ పనులను పూర్తి చేసి మండలంలోని ఐదు గ్రామాలకు సాగునీరందించి రైతులను ఆదుకుంటామన్నారు. దివంగత అర్గుల్ రాజారాం రాష్ట్ర రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించారని, మర్రి చెన్నారెడ్డితో పోటీపడి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయారెడ్డి, కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు గోర్త రాజేందర్, ముస్కు చిన్న సాయారెడ్డి, నర్సారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అనంత్‌రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు ఉమ్మాజీ నరేశ్, మండల అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ హల్‌చల్

- మద్యం మత్తులో దాడికి యత్నం
- పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుటే ఘటన

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఏఆర్ కానిస్టేబుల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుటే హల్‌చల్ చేశాడు. ఆదివారం రాత్రి నగరంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏఆర్ కానిస్టేబుల్ ఆయూబ్ స్కూటీపై వెళ్తుండగా అటువైపుగా ఓ ఫ్యామిలీ కారులో వెళ్తోంది. ఈక్రమంలో స్కూటీని కారు స్వల్పంగా ఢీకొంది. దీంతో, తన స్కూటీని కారు ఢీకొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయూబ్ కారును ఆపి డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి నుంచి బలవంతంగా ఆర్‌సీ లాక్కున్నాడు. కారులో ఉన్న మహిళలు కానిస్టేబుల్‌ను బతిమాలినప్పటికీ వినిపించుకోకుండా, దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి యత్నించాడు. సీపీ కార్యాలయం ఎదుటే అరగంటపాటు ఈ తతంగం కొనసాగినప్పటికీ అక్కడి పోలీసులు పట్టించుకోలేదు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు వాహనాన్ని ఆపి ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఏఆర్ కానిస్టేబుల్ ఆయూబ్ నుంచి ఆర్‌సీ తీసుకొని కారులో ఉన్న వారికి ఇచ్చారు. అక్కడి నుంచి కానిస్టేబుల్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయించగా, మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. బాధితులు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'హరితహారం'పై గొడ్డలివేటు



తిర్మలాపూర్ గ్రామంలో నరికివేతకు గురైన హరితహారం చెట్లు



తాడ్కోల్ డబుల్‌బెడ్‌రూం రోడ్డులో నరికివేతకు గురవుతున్న చెట్లు

బాన్సువాడ రూరల్ : హరితహారం లక్ష్యాన్ని పూర్తిచేయడానికి నాలుగైదేళ్ల క్రితం అధికారులు ఎక్కడ పడితే అక్కడ మొక్కలు నాటించారు. వాటికి చుట్టూ జాలీలు కట్టించి, ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి పెంచారు. తీరా అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగల కింద ఉన్నాయనే కారణంతో నరికివేస్తున్నారు. దీంతో విలువైన ప్రజాధనం వృథా అవుతోంది. నాటు ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటే సమయంలోనే విద్యుత్ తీగల కింద నాటకుండా ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేది కాదని గ్రామస్తులు సూచిస్తున్నారు. మండలంలోని తిర్మలాపూర్, తాడ్కోల్ డబుల్ బెడ్‌రూం కాలనీ రోడ్లలో పదుల సంఖ్యలో మొక్కలు నరికివేతకు గురయ్యాయి. అధికారుల్లో ఎలాంటి పశ్చాత్తాపం కన్పించకపోవడం బాధాకరం.



మహమ్మద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



బాల్కొండ మండల కేంద్రంలో..

గుర్తుకొస్తున్నాయి...



ఎడపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

ఎడపల్లి/బాల్కొండ/నిజాంసాగర్: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాలు నాటి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. దశాబ్దాల తరువాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ప్రేమను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

ఎడపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1983 నుంచి 1993 వరకు పదోతరగతి చదివిన విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు. మహమ్మద్‌నగర్ మండలం కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 1989 – 90 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1998 – 99 బ్యాచ్) పాండురంగ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

కర్రలతో పరస్పర దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగాపూర్ ప్రాంతంలో ఉన్న భవానీ హోటల్ వద్ద రెండు వర్గాలు కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. భవానీ దాబా వద్ద అజ్జు అనే వ్యక్తి నిలబడి ఉండగా ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. గతంలో ఇద్దరు రౌడీషీటర్లు మృతి చెందగా, వారి అనుచరుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అజ్జుపై దాడికి పాల్పడిన వారు అంజాద్‌భాయ్ దాడి చేయమని చెప్పడంతోనే.. దాడి చేసినట్లు తెలిపారు. దీంతో అంజాద్ ఇంటికి అజ్జు దాడికి వెళ్లాడు. ఆ తరువాత రెండు వర్గాలు కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ఐడియా అదిరింది..



బుస్సాపూర్ వద్ద జాతీయ రహదారిపై నిలిపిన బైక్

బాల్కొండ: ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి ఓ వ్యక్తి వేసిన ఐడియా అదిరింది. పంజాబ్‌కు చెందిన రతన్ సింగ్ అనే హార్వెస్టర్ డ్రైవర్ ఎండ నుంచి రక్షణ కోసం తన బైక్‌కు టాప్ బిగించాడు. దీంతో రోడ్డుపై వెళ్తున్న వారు బైకును చూసి ఆశ్చర్యపోతున్నారు. పంజాబ్ నుంచి బోధన్‌కు బైక్‌పై వెళ్తుండగా.. ఆదివారం బుస్సాపూర్ వద్ద 'సాక్షి' క్లిక్ మనిపించింది.

క్రైం కార్నర్

మైనర్ల ప్రేమవివాహం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్లు ప్రేమ వివాహం చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ ఆదివారం తెలిపారు. ఇంటర్ చదువుతున్న ఒకే గ్రామానికి చెందిన మైనర్లు ప్రేమించుకున్నారు. బాలిక ప్రవర్తనను గమనించిన తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేయాలని నిర్ణయించారు. దీంతో ఇరువురు ఇళ్ల నుంచి బయటికి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇరువురి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



ఎడపల్లి (బోధన్): మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో కొద్దిరోజుల క్రితం చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి స్థానిక బాలత్రిపురదేవి ఆలయంతో పాటు మరో ఆలయంలో సుమారు రూ.26వేలు చోరీకి పాల్పడ్డాడన్నారు.

విద్యుత్ స్తంభానికి మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖలీల్‌వాడి: షార్ట్ సర్క్యూట్ కారణంగా నగరంలోని తిలక్‌గార్డెన్ ప్రాంతంలో ఇనుప స్తంభంపై మంటలు చెలరేగాయి. స్తంభానికి వైర్లు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో షార్ట్‌సర్క్యూట్ అయ్యిందని స్థానికులు భావిస్తున్నారు. మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురై ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. విద్యుత్‌శాఖ ఏడీ తోట రాజశేఖర్ విద్యుత్ సరఫరాను నిలిపివేయించి మరమ్మతులు చేయించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- నాళేశ్వర్ వాగు నుంచి రాత్రి వేళల్లో తరలింపు
- వీడీసీ, అధికారుల అండతో ఇష్టారాజ్యం

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి రాత్రి వేళల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు సుమారు 50 నుంచి 60 మంది గ్రూపుగా ఏర్పడి ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారని పలువురు పేర్కొన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు వీడీసీకి చెల్లించిన ట్రాక్టర్ యజమానులు పోలీసు, రెవెన్యూ యంత్రాంగానికి ముడుపులు చెల్లిస్తూ ఇష్టానుసారంగా ఇసుకను తవ్వేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాళేశ్వర్ నుంచి నవీపేట, బాసర్, నందిపేట, నిజామాబాద్ తదితర ప్రాంతాల వైపు ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇటీవల నామ్‌కే వాస్తేగా దాడులు చేసిన పోలీసులు రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయినప్పటికీ ఇసుక అక్రమరవాణాలో జోరు తగ్గలేదు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలో ఆదివారం ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే న్యాయస్థానం పలువురికి జైలు శిక్ష విధించిందన్నారు.